సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 5 । మార్చి । 2024



కలల కొలువు దక్కింది

జిల్లాలో ఎంటీఎస్ ప్రాతిపదికన ఉద్యోగాల్లో చేరి ఏడాదైన సందర్భంగా 1998 డీఎస్సీ అర్హులు సోమవారం సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. 8లో ▸



అంతర్ రాష్ట్ర నేరస్తుడి అరెస్టు

అంతర్ రాష్ట్ర నేరస్తుడు షేక్ నాగూర్ మీరావలీ ఇటీవల ముగ్గురు మహిళ వృద్ధులను మోసం చేసిన కేసులో తణుకు పోలీసులకు చిక్కాడు. 8లో ▸

క్షీరారామం.. భక్తులకు స్వర్గధామం



పాలకొల్లు శ్రీక్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన అప్సడా వైస్ చైర్మన్



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం

తాడేపల్లిగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంటు అథారిటీ వైస్‌చైర్మన్ వడ్డి రఘురాం తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఫిబ్రవరి 28, 29 తేదీల్లో ఢిల్లీ పర్యటన వివరాలను రఘురాం సీఎంకు వివరించారు. కేంద్ర ఫిషరీస్ శాఖ మంత్రి పురుషోత్తం రూపాల, నీతి ఆయోగ్ సీఈఓ పీవీఆర్ సుబ్రహ్మణ్యం, నీతి ఆయోగ్ సలహాదారు నీలం పటేల్‌ను కలిసిన వివరాలను సీఎంకు వివరించానన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా కల్చర్‌పై జరుగుతున్న అభివృద్ధి, రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న కార్యాచరణ గురించి తెలిపానన్నారు. ఈ మేరకు సీఎం హర్షం వ్యక్తం చేసి, తనను అభినందించారని రఘురాం చెప్పారు.

స్పందన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించండి



ఓ మహిళ సమస్యను వింటున్న ఎస్పీ అజిత

భీమవరం: పోలీసు స్పందనలో వచ్చే ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను వేజెండ్ల అజిత ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో 18 అర్జీలు స్వీకరించారు. స్పందనలో మహిళలు, వృద్ధుల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం తెలిపి త్వరిత గతిని పరిష్కరించి న్యాయం చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో అలసత్వం వహించరాదని ఆదేశించారు. ఫిర్యాదు చేయడానికి వచ్చిన బాధితులకు పోలీసు కార్యాలయం వద్దనే భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 96 శాతం హాజరు

భీమవరం: జిల్లాలో సోమవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షకు 96 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని ఆర్‌ఐఓ కె.చంద్రశేఖర్‌బాబు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 50 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షల్లో జనరల్ విద్యార్థులు 16,800 మందికి గాను 16,341 మంది హాజరు కాగా, ఒకేషనల్ కోర్సుకు సంబంధించి 1,973 మందికి 1,766 మంది హాజరయ్యారన్నారు. ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు.

గడప చెంతకే అభివృద్ధి

లబ్ధిదారుల గడప వద్దకే సంక్షేమ పథకాలు చేరవేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధి పనుల్లోనూ అదే ఒరవడిని అవలంబిస్తోంది. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు నేరుగా ప్రజల వద్దకు వెళుతున్నారు. తమ ప్రభుత్వంలో ఆయా కుటుంబాల వారికి చేకూరిన లబ్ధిని వివరిస్తూనే వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. స్థానికంగా వచ్చిన వినతుల్లో సంక్షేమంతో పాటు మౌలిక, సామాజిక, ప్రాధాన్య అవసరాలను గుర్తిస్తున్నారు. సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులతో ఆయా అభివృద్ధి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తుండటంతో ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

- 'గడపగడపకు మన ప్రభుత్వం'తో సమస్యల సత్వర పరిష్కారం
- జిల్లాలో ఇప్పటివరకు 414 సచివాలయాల్లో కార్యక్రమం
- 1,336 ప్రాధాన్య పనులకు రూ.55.67 కోట్లు మంజూరు
- క్షేత్రస్థాయిలో ముమ్మరంగా అభివృద్ధి పనుల నిర్వహణ
- ప్రతిపాదన దశలో రూ.27.38 కోట్లతో మరో 500 పనులు
- 596 పనులు పూర్తి, నిర్మాణ దశలో మరో 644 పనులు
- చెంతకే వచ్చి ఏళ్ల నాటి సమస్యల పరిష్కారంపై సర్వత్రా హర్షం

ఇది కదా.. అభివృద్ధి



నరసాపురం మండలం చిట్టవరంలో నిర్మించిన కమ్యునిటీ హాల్ భవనం

'గడపగడప'లో అభివృద్ధి పనుల వివరాలు

నియోజకవర్గం	మంజూరైన పనులు	మొత్తం విలువ (రూ.కోట్లలో)
ఆచంట	346	11.63
నరసాపురం	216	11.68
తాడేపల్లిగూడెం	121	4.04
తణుకు	126	4.04
పాలకొల్లు	271	12.34
భీమవరం	61	2.30
ఉండి	186	7.27
ఉంగుటూరు (మండలం)	66	2.39



పెనుగొండ శివారు జీలం చెరువులో నిర్మించిన సీసీ రోడ్డు



పెనుమంట్ర మండలం వెలగలవారి పాలెంలో నిర్మించిన అండర్‌గ్రౌండ్ డ్రెయిన్



తణుకు సజ్జాపురంలోని ఎల్ఐసీ వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు

సాక్షి, భీమవరం: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా జిల్లాలో రూ.55.67 కోట్ల విలువైన 1,240 పనులు చేపట్టగా వీటిలో ఇప్పటికే 596 పనులు పూర్తి చేశారు. జిల్లాలోని 535 సచివాలయాలకు గాను జీజీఎంపీలో భాగంగా ఇప్పటివరకు 414 సచివాలయాల్లో ప్రజాప్రతినిధులు పర్యటించారు. ప్రజా అవసరాలకు సంబంధించి ఆయా ప్రాంతాల్లో మొత్తం రూ.83.05 కోట్ల విలువైన 1,836 ప్రాధాన్య పనులను గుర్తించారు. వీటిలో రూ.55.67 కోట్ల విలువైన 1,336 పనులు మొదలుపెట్టారు. వీటిలో ఇప్పటికే 596 పనులు పూర్తి కాగా, మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. మరో 500 పనులు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

చెంతకే వచ్చి వెతలు తీరుస్తున్నారు: గతంలో ఎన్నికల సమయంలో మినహా సామాన్యులకు పాలకులు దొరికే పరిస్థితి ఉండేది కాదు. సీఎం వైఎస్ జగన్ పాలనలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా పాలకులే ప్రజల వద్దకు వస్తున్నారు. ప్రజల సమస్యలు ఆలకించి సత్వర పరిష్కానికి చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నో ఏళ్లగా పట్టిపీడిస్తున్న సమస్యలను మంత్రులు, ఎమ్మెల్యేలు తమ ఇంటి వద్దకే వచ్చి పరిష్కరిస్తుండటంపై ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీర్ఘకాలంగా తమను వేధించిన సమస్యలు గడపగడపకు కార్యక్రమం ద్వారా తీరుతున్నాయని చెబుతున్నారు.



ఆకివీడు మండలంలోని సిద్ధాపురంలో నిర్మించిన పక్కా డ్రెయిన్

ఆకివీడు మండలం సిద్దాపురం ఎస్సీ కాలనీ పంచాయతీ చెరువుగట్టు చేర్చి 100 కుటుంబాలకు పైగా నివసిస్తున్నారు. ఇళ్లలోని వాడకం నీరు పోయేందుకు ఏర్పాటు చేసిన కచ్చా డ్రెయిన్ పూడిపోయి మురుగునీరు రోడ్డుపై నిలిచి పారిశుధ్యం క్షీణించి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దయనీయంగా మారేది. గడప గడపకు మన ప్రభుత్వం (జీజీఎంపీ) కార్యక్రమంలో భాగంగా తమ వద్దకు వచ్చిన డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు దృష్టికి స్థానికులు సమస్యను తీసుకురాగా ఆయన వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడి మురుగునీరు మెయిన్ డ్రెయిన్‌లోకి వెళ్లేలా జీజీఎంపీ నిధులు రూ.14 లక్షలతో డ్రెయిన్ నిర్మాణం చేయించారు. ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న సమస్య వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పాలకులు, అధికారులు చెంతకే వచ్చి పరిష్కరించడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

పక్కా డ్రెయిన్ నిర్మించారు



గ్రామంలోని మంచినీటి చెరువు పక్కనే ఉన్న ఎస్సీ కాలనీకి డ్రెయినేజీ సదుపాయం లేక చాలా ఇబ్బంది పడ్డాం. ఇళ్లలోని వాడకం నీరు రోడ్డుపైకి వచ్చి నడవడానికి వీలుండేది కాదు. మా ప్రాంతానికి వచ్చిన పీవీఎల్ నర్సింహరాజుకు సమస్య తెలుపగా నిధులు మంజూరు చేసి పక్కా డ్రెయిన్ నిర్మించడంతో సమస్యకు పరిష్కారం లభించింది. ఎస్సీ కాలనీకి ఇన్నేళ్లకు న్యాయం జరిగింది.

– పిల్లి లూథియమ్మ, సిద్ధాపురం, ఆకివీడు మండలం

మట్టి రోడ్డు నుంచి సీసీ రోడ్డు



మా వీధిలో చాలాకాలంగా మట్టి రోడ్డు మాత్రమే ఉండటంతో రాకపోకలకు చాలా ఇబ్బంది పడేవాళ్లం. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మా వీధికి వచ్చిన ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజుకు సమస్యను వివరించగా ఆయన వెంటనే స్పందించి రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు. రూ.15 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కూడా చేశారు.

– కోళ్ల జయ కనకదుర్గ, చిట్టవరం, నరసాపురం మండలం

అడిగిన వెంటనే రోడ్డు వేశారు



జీజీఎంపీలో భాగంగా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సజ్జాపురం ఎల్ఐసీ వీధిలోకి వచ్చినప్పుడు స్థానికులమంతా మా ప్రాంతానికి రోడ్డు నిర్మాణం చేయించాల్సిందిగా కోరాం. రూ.25 లక్షల నిధులతో వెంటనే సీసీ రోడ్డు నిర్మాణం చేయడం, ఇటీవల ప్రారంభించడం కూడా జరిగిపోయాయి. అడిగిన వెంటనే రోడ్డు నిర్మించినందుకు ఆయనకు కృతజ్ఞతలు.

– సీహెచ్ హనుమంతరావు, సజ్జాపురం, ఎల్ఐసీ వీధి

సమస్యలు పరిష్కారమయ్యాయి



జీజీఎంపీలో నాయకులు, అధికారులు ఇంటింటికి వచ్చి సమస్యలు తెలుసుకున్నారు. మేము నివాసం ఉంటున్న ఆది ఆంధ్ర పేటలో రోడ్డు సమస్య గురించి వారికి తెలియజేశాం. ఆ తర్వాత మా ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మించారు. గ్రామ శివారులైన చినపాలెం, పెద్ద పాలెం, బొల్లేటిగుంట ప్రాంతాల్లో కూడా రోడ్లు నిర్మించడంతో గ్రామంలో చాలావరకు రోడ్ల సమస్య పరిష్కారమైంది.

– యల్లమెల్లి రాంబాబు మట్టపర్రు, పోడూరు మండలం

అర్జీల పరిష్కారంలో నాణ్యత ప్రధానం



ఓ మహిళ సమస్య వింటున్న కలెక్టర్ గాంధీ

భీమవరం (ప్రకాశంచౌక్): స్పందనలో వచ్చిన అర్జీలను నాణ్యతతో కూడిన పరిష్కారం చూపాలని కలెక్టరు సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేటులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'జగనన్నకు చెబుదాం-స్పందన' కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో అందిన అర్జీల పరిష్కారంపై తీసుకున్న చర్యలు అర్జీదారులలో సంతృప్తి పెరిగేలా ఉండాలన్నారు. అర్జీల పరిష్కారంలో అవసరమైతే ఎక్కువ సమయం తీసుకున్నా అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. పెండింగ్ దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా అధికారులు దృష్టి పెట్టాలన్నారు. మండల స్థాయిలో స్పందన కార్యక్రమం చక్కగా నిర్వహించినట్లయితే జిల్లా స్పందన కార్యక్రమానికి ఎక్కువ తాకిడి ఉండదని, మండల అధికారులు గమనించాలన్నారు. స్పందన కార్యక్రమం ఉదయం 10 గంటలకే ప్రారంభమవుతుందని, జిల్లాలో వివిధ శాఖలు అధికారులు తప్పక హాజరుకావాలని ఆదేశించారు. సోమవారం స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి 228 అర్జీలు వచ్చాయి. జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, ఇన్‌చార్జి డీఆర్వో బి.శివ నారాయణ రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్, జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ కానాల సంగీత్ మధుర్, జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కేసీహెచ్ అప్పారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ అప్పిలేటు ట్రిబ్యునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాదు పాల్గొన్నారు.

'సమగ్ర శిక్ష'లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం: సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో ఖాళీగా ఉన్న సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ పి.శ్యామ్‌సుందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన ప్రధానోపాధ్యాయులు, డైట్ లెక్చరర్స్, స్కూల్ అసిస్టెంట్స్ ఈనెల 11వ తేదీ లోగా సమగ్రశిక్ష కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని శ్యామ్‌సుందర్ సూచించారు.

ఓటర్లకు బాసటగా కవాతు



వచ్చే ఎన్నికల్లో ఓటర్లలో మనోస్థైర్యం కల్పించేందుకు మొగల్తూరు ప్రధాన వీధుల్లో సోమవారం సీఐఎస్‌ఎఫ్, సివిల్ పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్ డీఎస్పీ ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. సీఐఎస్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ జర్నల్ సింగ్, అసిస్టెంట్ కమాండెంట్ రామన్‌జీ, నరసాపురం సీఐ గోవిందరాజు, మొగల్తూరు ఎస్సై కె.వెంకట రమణ, తహసీల్దార్ భాస్కర్ పాల్గొన్నారు. – మొగల్తూరు

పల్స్ పోలియో 95 శాతం పూర్తి



దగ్గులూరులో సూచనలిస్తున్న మహేశ్వరరావు

పాలకొల్లు అర్బన్: ఇంటింటికీ వెళ్లి ఐదేళ్ల లోపు ప్రతి చిన్నారికీ పోలియో చుక్కలు వేయాలని డీఎంఅండ్ హెచ్‌వో డా.డి మహేశ్వరరావు సూచించారు. దగ్గులూరులో సోమవారం ఆయన ఇంటింటికీ పల్స్ పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో 95 శాతం పూర్తి చేశామన్నారు. మిగిలిన 5 శాతం పిల్లలకు సోమ, మంగళ వారాల్లో పోలియో చుక్కలు వేస్తామన్నారు. గ్రామాంతరం వెళ్లిన చిన్నారుల విషయంలో ఒకటికి రెండు సార్లు ఆరా తీసి పోలియో చుక్కలు వేయించే బాధ్యత ఆ గ్రామ ఏఎన్‌ఎం, ఆరోగ్య సిబ్బందిదేనన్నారు. సంచార జాతులు, వలస కూలీల పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేయాలన్నారు. పోలియో చుక్కలు వేయించకపోవడం వలన కలిగే నష్టాలను తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. దగ్గులూరులో ఇంటింటికీ ఆయన తిరిగి పోలియో చుక్కలు వేయించుకున్నారో లేదో ఆరా తీశారు. మెడికల్ ఆఫీసర్ డా. నవ్యజీవన్ తదితరులున్నారు.

'నవరత్నాల'తో పేదలకు సొంత గూడు

- మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు
- అత్తిలిలో రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాల పంపిణీ




అత్తిలిలో మహిళకు రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టా అందజేస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: అర్హులకు ఇంటి స్థలంతో పాటు గృహాలను నిర్మించే బృహత్తర కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టడంతో పేదల సొంతగూడు కల నెరవేరిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. సోమవారం అత్తిలి శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి కల్యాణ మండపంలో మండలంలో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పత్రాల పంపిణీ కార్యక్రమానికి మంత్రి కారుమూరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో 31 లక్షల ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో పాటు 18 లక్షల ఇళ్ల కట్టించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అత్తిలి మండలంలో 2,750 మంది ఇళ్ల స్థలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ చేసిన పత్రాలు అందజేస్తున్నామని, ఈ పట్టాల ద్వారా బ్యాంకుల నుంచి రుణాన్ని పొందవచ్చన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో పేదరికం తగ్గిందన్నారు. ఓట్ల కోసం రెండు జెండాలు కప్పుకుని వస్తున్న టీడీపీ, జనసేన నాయకులు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని మంత్రి ప్రజలను కోరారు. అవినీతి రహితంగా ప్రజలకు అందిన సంక్షేమంతో ప్రజలలో పార్టీ కార్యకర్తలపై గౌరవం పెరిగిందన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు జన్మభూమి కమిటీల ముసుగులో ప్రజలను దోచుకుతింటే, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు నీతి, నిజాయితీగా ప్రజలకు సంక్షేమం చేరువ చేసి వారి మన్ననలు పొందారని గుర్తు చేశారు. నీతి, నిజాయితీకి మారుపేరుగా ఉన్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఒంటరిగా ఎదుర్కొనే దమ్ములేక ప్రతిపక్షాలు మూకుమ్మడిగా దాడిచేసేందుకు కుట్రలు పన్నుతున్నారని, వాటిని ఛేదించేందుకు పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకూ సీఎం జగన్ మేలు చేస్తారనే విషయం మర్చిపోవద్దన్నారు. సీఎం త్వరలో ప్రకటించే ఎన్నికల మేనిఫెస్టోతో ప్రతిపక్షాలు సుడిగాలిలో కొట్టుకుపోవడం ఖాయమన్నారు. మీకు మంచి జరిగితేనే ఓటెయ్యమన్న ఏకైక సీఎం వైఎస్ జగన్ చరిత్రలో నిలుస్తారని అన్నారు. ప్రజలకు మంచిచేస్తున్న జగన్ ప్రభుత్వానికి రానున్న ఎన్నికలలో ఓటర్లు రెండు ఓట్లను ఫ్యాను గుర్తుపై వేసి మరలా జగనన్నను సీఎం చేయాలని మంత్రి కోరారు. అత్తిలి గ్రామ పంచాయతీ మంజూరు చేసిన స్థల పట్టాలను అత్తిలి షష్టి కమిటీకి, మండల ఎస్సీ సంఘానికి, బీసీ సంఘానికి, టైలర్స్ సంఘానికి, మోటారు మెకానిక్ యూనియన్‌కి, మానవతా సంస్థవారికి మంత్రి కారుమూరి చేతుల మీదుగా అందజేశారు. అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, సర్పంచ్ గంటా విజేత నాగరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, జడ్పీ కో–ఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, నియోజకవర్గ పరిశీలకుడు జక్కంశెట్టి సత్యరాజేంద్రప్రసాద్, మహిళా విభాగం అధ్యక్షురాలు కాకర్ల విశాలాక్షి, ఎంపీటీసీ సభ్యురాలు రంభ సుజాత, నాయకులు రామిశెట్టి రాము, ఆకుల పండుస్వామి, సొసైటీ అధ్యక్షులు వట్టికూటి సూర్యనారాయణ, గుబ్బల ఆంజనేయులు, అత్తిలి టౌన్ అధ్యక్షులు పోలినాటి చంద్రరావు, రంభ సూరిబాబు, గారపాటి నాగరాజు, కోరుకొల్లు వెంకట్రావు, తహసీల్దార్ ఎ.తాతారావు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అభివృద్ధి పథంలో గ్రామాలు

- శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు
- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్‌తో కలిసి పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభం



గుమ్ములూరులో ఓ మహిళకు రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాను అందిస్తున్న మోషేన్‌రాజు, పీవీఎల్

ఆకివీడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామాలు ప్రగతిపథంలో పయనిస్తున్నాయని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల్ని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, పలువురు ప్రజా ప్రతినిధులు సోమవారం పాల్గొని ప్రారంభోత్సవాల్ని పండుగ వాతావరణంలో నిర్వహించారు. చినమిల్లిపాడులో సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. అనంతరం గ్రామ సచివాలయ భవనాన్ని, సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం సిద్ధాపురంలో ఆర్బీకే సెంటర్, విలేజ్ క్లినిక్, సచివాలయ భవనాలను ప్రారంభించారు. గుమ్ములూరులో సచివాలయ, రైతు భరోసా, విలేజ్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. భవనాల్ని సుందరంగా నిర్మించడంపై మోషేన్‌రాజు అభినందించారు. ఈ సందర్భంగా మోషేన్‌రాజు మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రభుత్వంలో అభివృద్ధి జరగలేదని విమర్శించే నాయకులు కొత్త భవనాలతో కళకళలాడుతున్న గ్రామాలను రెండు కళ్లు పెట్టి చూడాలన్నారు. సీఎంగా వైఎస్ జగన్ వచ్చిన తరువాత గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లకు పక్కా భవనాలు నిర్మించి గ్రామ పరిపాలన వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. గ్రామాల్లోని 80 శాతం రహదారులు సీసీ రోడ్లుగా అభివృద్ధి చెందాయన్నారు. పల్లెల్లో అన్ని వసతులూ కల్పిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో పూర్తి మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పాలనలో గ్రామాలు ప్రగతి బాట పట్టాయన్నారు. అన్ని మౌలిక సదుపాయాలతో, గడప వద్దకే ప్రభుత్వ పాలన అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. పాడి పంటలు వృద్ధి చెందుతున్నాయన్నారు. భీమవరం అసెంబ్లీ పరిశీలకులు ఎం.గంగాధరరావు, జెడ్పీటీసీ యండగండి శ్రీను, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, మహిళా సమాఖ్య రాష్ట్ర డైరెక్టర్ పళ్లెం అరుణకుమారి, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు గాలి సామ్రాజ్యం, మండల జేసీఎస్ కన్వీనర్ పుప్పాల పండు, పార్టీ పట్టణ అధ్యక్షులు అంబటి రమేష్, సర్పంచ్‌లు కోట అనంత లక్ష్మి, చిగురుపాటి చిట్టిబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏలూరు వెళ్లి పింఛన్ అందజేత



ఏలూరులో పింఛన్ ఇస్తున్న వలంటీర్ రామలక్ష్మి

వీరవాసరం : కొణితివాడ గవరపాలెంకి చెందిన కర్రి మురళీకృష్ణ వికలాంగు పింఛన్ లబ్ధిదారు. గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ కోటి రామలక్ష్మి ఏలూరు వెళ్లి అతనికి పింఛన్ అందజేసింది. ఈ సందర్భంగా వలంటీర్ రామలక్ష్మిని సర్పంచ్ బీశెట్టి లక్ష్మి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గొలగాని సత్యనారాయణ, ఎంపీటీసీ నాగరాజు పద్మకళ, పి.సైదేశ్వరరావు, నాగరాజు వెంకట శ్రీనివాసరాజు, కర్రి రవికుమార్, నాగరాజు వెంకట గోపాలకృష్ణ రాజు, గ్రామ సచివాలయ సిబ్బంది అభినందించారు.

కలల కొలువు దక్కింది

- 1998 డీఎస్సీ అర్హులు ఎంటీఎస్ టీచర్లుగా నియామకం
- జిల్లాలో 274 మందికి ఎంటీఎస్ ప్రాతిపదికన ఉద్యోగాలు
- మరో నెలలో వారికి ఉద్యోగాలు వచ్చి ఏడాది పూర్తి
- సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి టీచర్ల క్షీరాభిషేకం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంటీఎస్ టీచర్ల నాయకులు

దెందులూరు: అర్హత ఉన్నా ప్రభుత్వ ఉద్యోగం దక్కలేదు.. ఏళ్ల తరబడి నిరీక్షణ.. ఎందరు ప్రజాప్రతినిధులను ఎన్నేళ్లు కలిసినా ఫలితం శూన్యం.. ఇక తమ కలల కొలువు దక్కదేమోనన్న నైరాశ్యం.. ఇది ఒకప్పటి 1998 బ్యాచ్ బీఈడీ క్వాలిఫై అయిన నిరుద్యోగుల పరిస్థితి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో వీరి బాధలను అర్థం చేసుకున్నారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తానని మాటిచ్చారు. చెప్పినట్లుగానే అధికారంలోకి రాగానే మినిమం టైమ్‌స్కేల్ ప్రాతిపదికన వారికి ఉద్యోగాలు కల్పించారు. దీంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేలాది కుటుంబాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధిని కల్పించారని మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) టీచర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు తమకు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేశారని, అనంతరం నలుగురు ముఖ్యమంత్రులు మారినా తమకు న్యాయం జరగలేదని వాపోయారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే తమ బాధలను అర్థం చేసుకుని, అందరికీ ఉద్యోగాలు ఇచ్చారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 274 మందికి మినిమం టైమ్‌స్కేల్ ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించారని, నెలకు రూ. 33 వేలు జీతం ఇస్తూ ఏళ్ల తరబడి నిరుద్యోగంతో ఉన్న తమ కుటుంబాల్లో ఉపాధి భద్రత కల్పించారని మినిమం టైం స్కేల్ ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే నెల 13వ తేదీ నాటికి తమకు ఉద్యోగాలు వచ్చి ఏడాది పూర్తవుతుందని, తాము సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పుడూ రుణపడి ఉంటామని మినిమం టైంస్కేల్ ఉద్యోగుల కుటుంబ సభ్యులు, బంధువులు చెబుతున్నారు.

సీఎంకు రుణపడి ఉంటాం



అర్హత ఉండి ప్రభుత్వం ఉద్యోగం పొందలేని వేలాది మందికి ఉద్యోగాలు కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. అందరితో పాటు అర్హులైన ఉపాధ్యాయులకు సైతం ఉద్యోగాలు కల్పించిన గొప్ప మనస్సు ఉన్న వ్యక్తి వైఎస్ జగన్.

– తోట ఎడ్వర్డ్, ఎంటీఎస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు

ఇక ఆశలు వదులుకున్నాం..



అర్హత ఉన్న అందరికీ ఎలా ఉద్యోగం వచ్చిందో మాకు కూడా అలాగే ఉద్యోగం వస్తుందని కలలు కన్నాం.. ఉద్యోగం రాకపోవడంతో ఇక ఆశలు వదులుకున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మమ్మల్ని గుర్తించి ఉద్యోగాలు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉంది.

– థెరిస్సామ్మ చౌదరి, ఎంటీఎస్ టీచర్

మా కుటుంబం సంతోషంగా ఉంది



మాకు ఉద్యోగాలు ఇవ్వడంతో మాతో పాటు మా కుటుంబ సభ్యులు సంతోషంగా ఉన్నారు. ఉద్యోగం పొందిన ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యుల తరుపున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. ఆయనకు ఎప్పుడూ రుణపడి ఉంటాం.

– మేరి గ్రేస్ , ఎంటీఎస్ టీచర్

తండ్రి బాటలోనే తనయుడు



దివంగత నేత వైఎస్సార్ బాటలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పయనిస్తున్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను మాట తప్పకుండా డీఎస్సీ అర్హులకు ఉద్యోగాలు కల్పించారు. సీఎం వైఎస్ జగన్ పేదల కష్టాలు తెలిసిన గొప్ప ప్రజా నాయకుడు.

– జయబాబు, ఎంటీఎస్ టీచర్

మాకు ప్రభుత్వ గుర్తింపు లభించింది



మాకు ఉద్యోగం ఇచ్చి నిరాశలో ఉన్న మా అందరికీ ప్రభుత్వ గుర్తింపు, జీతం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. ఖచ్చితంగా ఉద్యోగం రాదన్న అభిప్రాయంతో ఉన్న మాకు సీఎం జగన్ నిర్ణయం కొండంత బలాన్ని ఇచ్చింది.

– ఎండీ బాషా, ఎంటీఎస్ టీచర్

వైఎస్ జగన్ ఒక్కరే గుర్తించారు



చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మాకు ఉద్యోగాలు ఇవ్వలేదు. అర్హత ఉండి కూడా ప్రభుత్వ ఉద్యోగం పొందలేకపోయాం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే మమ్మల్ని గుర్తించి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా నియామకం చేయడం ఏపీ చరిత్రలో నిలిచిపోతుంది.

– పరిశుద్ధం, ఎంటీఎస్ టీచర్

వేర్వేరు చోట్ల రేషన్ బియ్యం పట్టివేత

పాలకొల్లు సెంట్రల్, పోడూరు, అత్తిలి: వేర్వేరు గ్రామాల్లో సోమవారం విజిలెన్స్ అధికారులు దాడి చేసి అక్రమంగా నిల్వ ఉంచిన, తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పాలకొల్లులో తాడికొండ వెంకటకృష్ణారావు షాపులో, కవిటం లాకుపేట వద్ద కిరాణాషాపులో పదేసి క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే అత్తిలి మండలం కె సముద్రపుగట్టు గ్రామం వద్ద వాహనంలో తరలిస్తున్న 11 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

క్షీరారామం.. భక్తులకు స్వర్గధామం



క్షీరారామలింగేశ్వరస్వామి గాలిగోపురం



క్షీరారామలింగేశ్వరస్వామి



పార్వతీదేవి



క్షేత్రపాలకుడు జనార్దనస్వామి

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రాల్లో ఒకటైన పాలకొల్లు శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం భక్తులపాలిట స్వర్గధామంగా విరాజిల్లుతోంది. ఇక్కడ స్వామివారు పార్వతీ సమేతుడిగా దర్శనమిస్తారు. ఈ క్షేత్రంలో అమృతలింగ శిరోభాగాన్ని త్రేతాయుగంలో శ్రీరాముడు పునః ప్రతిష్ఠించాడని పురాణాలు చెపుతున్నాయి. శివుని కోరికపై ఇక్కడ మహావిష్ణువు లక్ష్మీసమేతుడై క్షేత్రపాలకుడిగా కొలువై ఉన్నారు. ఈ ఆలయం పంచాయతన ఆలయంగా ప్రసిద్ధి. ఆలయంలో స్వామివారిని దర్శించుకోవడానికి గాలిగోపురం నుంచి ఐదు ద్వారాలు ఉంటాయి, ఐదు నందులు, ఐదు గణపతులు, వరుసగా ఐదు ఆలయ శిఖరాలు, ఐదుగురు అమ్మవార్లు, ఐదు మండపాలు, ఐదు శివలింగాలు దర్శనమిస్తాయి. స్వామివారి గర్భాలయం 11 ద్వారాలతో ఉంటుంది. ఆలయంలో సరస్వతీదేవి, మహిషాసురమర్దినీ, గోకర్ణేశ్వరస్వామి, వినాయకుడు, శనీశ్వరుడు, కాశీ విశ్వేశ్వరుడు, నగరేశ్వరుడు, కుమారస్వామి, వీరభద్రుడు, కాలభైరవుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, పంచముఖ లక్ష్మీగణపతి, బ్రహ్మ, ఆంజనేయస్వామి ఉపాలయాల్లో కొలువై ఉన్నారు.

120 అడుగుల గాలిగోపురం....

ఆలయ ముఖ ద్వారంలో 120 అడుగుల ఎత్తున తొమ్మిది అంతస్తులతో గాలిగోపురం ఉంటుంది. గోపురంపైన ఉన్న శిఖరాలను దర్శించుకోవడానికి లోపల మెట్ల మార్గం ఉంది. ఈ గాలిగోపురంపైన ప్రాచీన శిల్పకళా వైభవంతో కనుల విందుగా ఆకర్షితంగా ఉంటుంది.

కొప్పేశ్వరుడు..

శైవక్షేత్రాల్లో శ్రీశైలం తరువాత మహాశివరాత్రి నాడు లింగోద్భవ సమయంలో పాగా కట్టే సంప్రదాయాన్ని ఈ క్షీరారామలింగేశ్వర స్వామి క్షేత్రంలోనూ కొనసాగిస్తుంటారు. స్థలపురాణంలో ఇక్కడి శివలింగం మొనతేలి శివుని కొప్పు భాగాన్ని సూచిస్తుంది. ఇది అమృతలింగం శిరోభాగమని చెప్పడంతో పాటు శాసనాల్లో స్వామిని కొప్పేశ్వరుడిగా పేర్కొన్నారు. ఈ శివలింగంపై ఉన్న నొక్కులు కుమారస్వామి అమృత లింగాన్ని ఛేదించిన సమయంలో తగిలిన బాణపు దెబ్బలని భక్తుల విశ్వాసం. ఇక్కడ శివలింగం తెల్లగా పాలవర్ణంలో 2.5 అడుగుల ఎత్తున ఉంటుంది. స్వామి సన్నిధిలో ఒకరోజు నిద్రిస్తే లభించే పుణ్యం వారణాసిలో ఏడాది ఉంటే కలిగే పుణ్యంతో సమానమని ప్రతీతి.

5 నుంచి ఉత్సవాలు ప్రారంభం

పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 5 నుంచి 9 వరకూ మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలు పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. 5వ తేదీ ఉదయం నుంచి అభిషేకాలు, కుంకుమ పూజలు, రుద్రహోమం, సాయంత్రం 5 గంటలకు ముత్యాల పూజ, 6 గంటలకు లీలా కల్యాణం జరుగుతుంది. బుధ, గురువారాల్లో ఉదయం నుంచి అభిషేకాలు, లక్షపత్రి పూజ, లక్ష కుంకుమార్చన నిర్వహిస్తారు. మహాశివరాత్రి రోజు 8వ తేదీ తెల్లవారుజామున 4 గంటల నుంచి స్వామివారి దర్శనం ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం 12 నుంచి స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తారు. భక్తులకు ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అభిషేకాలకు రుసుం రూ.100గా నిర్ణయించారు. రాత్రి 8.35 గంటలకు జగజ్యోతి వెలిగిస్తారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో దగ్గులూరు వరదా సోమేశ్వరరావు నేచిన మల్లన్న పాగాను స్వామివారికి అలంకరించనున్నారు. అనంతరం లక్షపత్రి పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈవో యాళ్ల సూర్యనారాయణలు ఉత్సవ ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు.

క్షేత్ర విశిష్టత

కుమారస్వామి తన శక్తి ఆయుధంతో తారకాసురుడి కంఠంలోని అమృతలింగాన్ని ఛేదించగా పంచభాగాలయ్యాయి. పంచఖండాలైన ఆ శివలింగాలు పశ్చిమగోదావరి జిల్లాలో క్షీరారామం (పాలకొల్లు)లో క్షీరారామలింగేశ్వరస్వామిగా విష్ణుమూర్తి, భీమవరంలో సోమేశ్వరస్వామిగా చంద్రుడు, తూర్పుగోదావరి జిల్లా ద్రాక్షారామంలో భీమేశ్వరస్వామిగా దక్షుడు, సామర్లకోటలో కుమార భీమేశ్వరునిగా కుమారస్వామి, గుంటూరు జిల్లా అమరావతిలో అమరేశ్వరునిగా ఇంద్రుడు ఈ ఐదు లింగాలను ప్రతిష్ఠ చేశారు. శివుని స్వరూపాలైన ఈ ఐదు క్షేత్రాలు పంచారామ క్షేత్రాలుగా ప్రసిద్ధి చెందినట్లు స్థల పురాణం చెబుతుంది.

7 నుంచి వీరంపాలెంలో శివరాత్రి ఉత్సవాలు

తాడేపల్లిగూడెం రూరల్ : వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరీ ఆధ్యాత్మిక పీఠంలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు పీఠం వ్యవస్థాపకులు గరిమెళ్ళ వెంకటరమణ శాస్త్రి తెలిపారు. సోమవారం పీఠంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ 7వ తేదీ ఉదయం 8.43 గంటలకు కలశస్థాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం ఇత్యాది పూజా కార్యక్రమాలు జరుతాయన్నారు. అదే రోజు ఉదయం 11.30 గంటలకు కాశీ జలాలతో ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం 4 గంటలకు మేధాసరస్వతీ అమ్మవారికి లక్ష పుష్పార్చన, ధ్వజారోహణ, రాత్రి ఆధ్యాత్మిక ఉపన్యాసం, భూప్రస్తార శ్రీచక్రార్చన ఏర్పాటు చేసినట్లు వివరించారు. 8వ తేదీన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా 10 రకాల నదీ జలాలతో అఘోర రుద్రాభిషేకం, 12 విశేష ద్రవ్యాలతో అభిషేకాలు, అఘోర పాశుపతాభిషేకం, 11 లక్షల రుద్రాక్షలతో అర్చనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే రోజు రాత్రి 9 గంటలకు శివపార్వతుల దివ్య కల్యాణం, లక్ష జ్యోతిర్లింగార్చన, లింగోద్భవకాల అభిషేకం, 9వ తేదీన సంపూర్ణ పూర్ణాహుతి, శాంతి కళ్యాణం, స్వామివారి పరిక్రమణ (ఆలయం చుట్టూ ప్రదక్షిణ)తో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా నాలుగువేల మంది సేవకులను ఏర్పాటు చేశామన్నారు. త్వరితగతిన స్వామివారి దర్శన భాగ్యాన్ని భక్తులకు కల్పించేందుకు రెండు వరుసలలో ఒకేదిశగా క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు.

సందేశాత్మకంగా నాటికలు



మనస్విని నాటికలో ఓ సన్నివేశం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని పాలకొల్లు కళా పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న 15వ జాతీయ నాటికల పోటీల్లో భాగంగా సోమవారం రెండవ రోజు ప్రదర్శించిన సందేశాత్మకమైన నాటికలు ప్రేక్షకులను ఆలోచింపజేశాయి.

కష్టం వస్తే.. నా రాతింతే..

మనిషికి కష్టం వస్తే నా రాతింతే.. నా రాత బాగోలేదు అంటూ నిట్టూరుస్తాడు. సుఖం విషయంలో మాత్రం ఆ రాతను గాలికొదిలేస్తాడు. తాను పొందాల్సినవి మాత్రం మంచిగా పొందుతాడు తాను తిరిగి ఇవ్వవలసిన వాటి విషయంలో మాత్రం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తాడు. ఇలాంటి వ్యక్తుల వల్ల సమాజంలో జరుగుతున్న అనర్థాలు, విశేషాలు తెలియజేస్తూ వెలగలేరు థియేటర్ ఆర్ట్స్, వెలగలేరు, ఎన్‌టిఆర్ జిల్లా వారు ప్రదర్శించిన రాత నాటిక ఎంతగానో ఆకట్టుకుంది. రచన దర్శకత్వం పి శ్రీనివాసరావు వహించారు.

డబ్బే ప్రధానం

మానవీయ విలువల కన్నా డబ్బే ప్రధానమంటున్న ఈ రోజుల్లో మానవ సంబంధాల్లోని మానవీయ కోణాన్ని ఆవిష్కరిస్తూ అందులోని మాధుర్యాన్ని రసవత్తరంగా తెలియపరిచిన ప్రదర్శన అరవింద్ ఆర్ట్స్ తాడేపల్లి వారి మనస్విని నాటిక. రచన వల్లూరు శివప్రసాద్, దర్శకత్వం గంగోత్రి సాయి వహించారు.

మత్తు నుంచి విముక్తి

సమాజాన్ని ముందుండి నడిపించాల్సిన యువత ఈ రోజు గంజాయి, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. ఈ మత్తు పదార్థాల నుంచి యువతను, దేశాన్ని రక్షించుకుందామనే అంశంతో ఉషోదయ కళానికేతన్, కట్రపాడు వారు ప్రదర్శించిన విముక్తి నాటిక కళాప్రియులను ఎంతగానో ఆకట్టుకుంది. రచన, దర్శకత్వం చెరుకూరి సాంబశివరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కళాపరిషత్ సభ్యులు కేవీ కృష్ణవర్మ, మేడికొండ శ్రీనివాసరావు, విటాకుల రమణ, జక్కంపూడి కుమార్, కొణిజేటి గుప్త తదితరులు పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర నేరస్తుడి అరెస్టు



తణుకులో వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగరాజు

తణుకు: ఏటీఎం కేంద్రాల వద్ద కార్డుల మార్పిడి.. మాయ మాటలు చెప్పి బ్యాంకులకు వచ్చే కస్టమర్ల వద్ద నగదు దొంగిలించడం వంటి నేరాలకు పాల్పడిన అంతర్‌రాష్ట్ర నేరస్తుడు కొవ్వూరు మండలం పశివేదల గ్రామానికి చెందిన షేక్ నాగూర్ మీరావల్లీ అలియాస్ అభిని తణుకులో పోలీసులు పట్టుకున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఇతనిపై సుమారు 46 కేసులు నమోదయ్యాయి. 2011 నుంచి ఇదే తరహా మోసాలకు పాల్పడుతున్న మీరావల్లీ ఒక కేసు విషయంలో రాజమండ్రి సెంట్రల్ జైలుకు వెళ్లి గత నెల 13న బెయిల్‌పై విడుదల అయ్యాడు. ఇప్పుడు మరో కోణంలో ముగ్గురు వృద్ధమహిళలను మోసం చేసి తణుకు పోలీసులకు చిక్కి మరోసారి కటకటాలు లెక్కిస్తున్నాడు. సోమవారం తణుకు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ సీఐ ఎం.నాగరాజు ఈమేరకు వివరాలు వెల్లడించారు. తణుకు బ్యాంకు కాలనీకు చెందిన మండేపూడి పద్మ, మండేపూడి సూర్యకాంతం, గొల్లి సావిత్రి ఈనెల 1న వలంటీర్ చేతుల మీదుగా రూ.3 వేలు చొప్పున పింఛన్ అందుకున్నారు. కొద్దిసేపటికి వచ్చిన మీరావల్లీ ఈనెల నుంచి ప్రభుత్వం పింఛన్ రూ.6 వేలు చేసిందని మీరు సచివాలయానికి వస్తే మిగిలిన డబ్బులు ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఆధార్‌కార్డులు తెచ్చుకోవాలని చెప్పి వారి వద్ద రూ.9 వేలు తీసుకుని ఉడాయించాడు. దీంతో తాము మోసపోయామని భావించిన వృద్ధులు తణుకు పట్టణ పోలీసులను ఆశ్రయించారు. ఎస్సై పి.అప్పారావు కేసు నమోదు చేసి సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. మీరావల్లీని ఇరగవరం కాలనీ వద్ద అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. నిందితుడి వద్ద రూ. 9 వేలు నగదుతోపాటు మోటారుసైకిల్ స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై కేవలం ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లోనే 38 కేసులు నమోదైనట్లు సీఐ వెల్లడించారు. ఈ కేసులో సహకరించిన ఎస్సైలు పి.అప్పారావు, కె.శ్రీనివాస్, కానిస్టేబుళ్లు ఆర్‌ఎండీవీ ప్రసాద్, ఎ.ఉదయ్‌కుమార్, జి.మురళి, బి.వీ రాజులను సీఐ నాగరాజు అభినందించారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత



ప్రమాదబీమా చెక్కును అందజేస్తున్న దృశ్యం

భీమవరం: గతేడాది ఫిబ్రవరి 6వ తేదీన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన మెరుగు జాన్‌రాజు మృతి చెందాడు. అతని కుటుంబ సభ్యులకు సోమవారం బీమా సొమ్ము రూ.20 లక్షల చెక్కును భీమవరం ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ శెట్టి గురవయ్య అందజేశారు. జాన్‌రాజు వ్యక్తిగత ప్రమాద బీమా పథకంలో చేరినట్లు కుటుంబ సభ్యులకు తెలియలేదని, అతను మృతిచెందినట్లు తెలిసిన పట్టణంలోని గునుపూడి ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్, జనరల్ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నామిని అయిన కుసుమకు బీమా సొమ్ము చెక్‌ను అందచేసినట్లు గురవయ్య చెప్పారు. ప్రమాద బీమా పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

మేడపాడులో పిచ్చికుక్క స్వైరవిహారం



గాయపడ్డ బాధితులు

యలమంచిలి: మేడపాడులో సోమవారం ఉదయం ఓ పిచ్చికుక్క స్వైర్వవిహారం చేసింది. సెంటర్‌లో ఉదయం 10 గంటల ప్రాంతంలో ముందుగా ఒక మెకానిక్‌పై దాడి చేసి గాయపర్చింది. అనంతరం అది సుమారు కిలోమీటరుమేర పరిగెడుతూ వరుసగా ఆరుగురిని కరిచింది. ఆ సమయంలో సెంటర్‌లోని వారంతా హాహాకారాలు చేస్తూ పరుగులు తీశారు. పిచ్చికుక్క దాడిలో గాయపడిన వారిలో మెకానిక్ కె.చిరంజీవి (36), జి.చిన్ని (55), కె.ఏడుకొండలు (28), జి.రామారావు (36), ఒ.అప్పారావు (60), ఎం.గంగమ్మ (80) ఉన్నారు. వారికి మేడపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మెడికల్ ఆఫీసర్ కె.భారతి చికిత్స చేయగా స్టాఫ్‌నర్స్ కె.మంగతాయారు వాక్సిన్ వేశారు.

క్లుప్తంగా

భవిత సెంటర్‌లో సేవా కార్యక్రమాలు అభినందనీయం


భవిత సెంటర్‌లో బుక్స్, స్టేషనరీ అందజేస్తున్న లయన్స్‌క్లబ్ డైమండ్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో క్లబ్ విద్యా సంకల్పం కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని భవిత సెంటర్‌లోని విద్యార్థులకు బుక్స్, స్టేషనరీ, స్నాక్స్ అందజేశారు. పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనం అందించారు. దాతలు పెన్మత్స వెంకట రామరాజు, లంకా శ్రీనివాస్‌లు సహకరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి మునగాల జితేంద్ర, కె.సాయి సత్యనారాయణ రాజు, కుందుం వెంకటేశ్వరరావు, యర్రా ఆంజనేయ స్వామి, జామి సత్యనారాయణ, ఎం.వెంకటరత్నం, భవిత సెంటర్ నిర్వాహకులు బాల ఈశ్వరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీని రానున్న ఎన్నికల్లో ఓడించాలి


చిర్ల పుల్లారెడ్డి

తాడేపల్లిగూడెం (టీఓసీ): బీజేపీని రానున్న ఎన్నికలలో ఓడించాలని తాలూకా రైల్వే గూడ్స్ షెడ్డు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి సోమవారం యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కార్మికులకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దేశంలో ఎన్నికల వేడి వచ్చిందని, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఏపీకు తీరని ద్రోహం చేసిందని చెప్పారు. రాష్ట్ర విభజన హామీలను అమలు చేయలేదన్నారు. ఈకార్యక్రమంలో సత్తి కోదండరామిరెడ్డి, కర్రి సాయి రెడ్డి, మద్దాల పుత్రయ్య, నాని, సుబ్బిరెడ్డి, వెంకట్రావు, అడపా ఆంజనేయులు, ఎ.కృష్ణ పాల్గొన్నారు.

ఇంటికి దీపం ఇల్లాలు


కుంచనపల్లి గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఇల్లాలు ఇంటికి దీపం వంటిదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని కృష్ణయపాలెం, ఆరుగొలను, కుంచనపల్లి గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల ఆవశ్యకతను శ్రీదేవి వివరించారు. పురుషులతో సమానంగా మహిళలు నేటి సమాజంలో అన్ని రంగాల్లోనూ ముందుకు దూసుకుపోతున్నారన్నారు. 18 ఏళ్లు నిండే వరకు బాలికలకు వివాహాలు చేయరాదన్నారు. యుక్త వయస్సు వచ్చిన తర్వాత వివాహాలు చేయడం వల్ల వివాహ వ్యవస్థపై వారికి ఒక అవగాహన వస్తుందన్నారు. తద్వారా వారు గర్భం దాల్చిన సమయంలో ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసమే విద్యాభివృద్ధికి సూచిక


వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెంటపాడు: వ్యక్తిత్వ వికాసమే విద్యాభివృద్ధికి ప్రధాన సూచిక అని ఉమ్మడి జిల్లా మానవత స్వచ్ఛంద సేవా సంస్థల చైర్మన్ తాడేపల్లి మోహనరావు పేర్కొన్నారు. ముదునూరుపాడు బాలికల ఓరియంటల్ ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థులకు కేరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు మానవత ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మోహనరావు పలువురు ఉపాధ్యాయులు ఘనంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు దుర్గాలక్ష్మిలు పాల్గొన్నారు.

దేవుని వాక్యానికి విధేయులు కావాలి

పెంటపాడు: విశ్వాసులు దేవుని వాక్యానికి విధేయులై, ఆయనకు లోబడి జీవనం సాగించాలని పడాలకు చెందిన వాక్యజ్యోతి మినిస్ట్రీస్ వ్యవస్థాపకురాలు, ప్రవక్తిని కొమ్మిశెట్టి అమ్మాజీ పేర్కొన్నారు. జట్లపాలెం గ్రామంలో సోమవారం రాత్రి క్రీస్తు సువార్త స్వస్థత సభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధ్యాత్మిక జీవనాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. క్రీస్తుకు విధేయులై ఉండాలన్నారు. ఈ సభలో రంగారెడ్డి జిల్లాకు చెందిన సాయిలన్న, పాస్టర్లు ఘనరాజు, జాజిరాజులు పాల్గొన్నారు.

సుపరిపాలనలో వలంటీర్ల పాత్ర కీలకం

- పారదర్శకంగా సంక్షేమం అందజేసిన ఘనత వలంటీర్లదే
- వలంటీర్ల వందనం కార్యక్రమంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు


అత్తిలిలో వలంటీర్లను సత్కరిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: స్థానిక సుపరిపాలనలో వలంటీర్ల పాత్ర కీలకమని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. సోమవారం అత్తిలి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈసందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల గడప వద్దకు చేరుతున్నాయని తెలిపారు. ప్రజలకు మంచి చేస్తున్న వలంటీర్ వ్యవస్థపై ప్రతిపక్ష పార్టీలు అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం రూపొందించిన సంక్షేమ పథకాలను ప్రజల గడపలోకి తీసుకువెళ్లడంలో వలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రజలకు పారదర్శకంగా సంక్షేమాన్ని అందించే క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వలంటీరు వ్యవస్థ కోవిడ్ సమయంలో అందించిన సేవలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాయని ప్రశంసించారు. కోవిడ్ వ్యాప్తి పెరగకుండా నిలిపేందుకు ఇతర రాష్ట్రాలు తీవ్ర ఇబ్బందులు పడ్డాయని, కానీ ఏపీలో మాత్రం వలంటీరు వ్యవస్థ ద్వారా ఇతర దేశాల నుంచి వచ్చిన వారిని గుర్తించి క్వారంటైన్‌లో ఉంచారని స్పష్టం చేశారు. అంతేకాకుండా కోవిడ్ సమయంలో రెడ్ జోన్‌లలోకి వెళ్లి మరీ వలంటీర్లు ప్రజలకు అందించిన సేవలు వెలకట్టలేనివని గుర్తుచేశారు. సేవ చేసే వారంటే నాకు చాలా ఇష్టమని అటువంటి సేవలో నిమగ్నమైన వలంటీరు వ్యవస్థను నేను అమితంగా ఇష్టపడుతున్నట్లు చెప్పారు. తణుకు నియోజకవర్గంలో రూ. 3300 కోట్లు సంక్షేమం, అభివృద్ధి జరిగిందంటే వలంటీరు చేసిన కృషేనని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ నర్సాపురం పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల మాట్లాడుతూ నవరత్నాల కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను పేదల సంక్షేమానికి అమలు చేస్తుందని, వాటిని అర్హులైన వారికి అందించడానికి వలంటీర్లు చేసిన సేవ మరువలేనిదని అన్నారు. వలంటీర్‌గా కాక ఆయా కుటుంబాల సభ్యులుగా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. వలంటీర్లు తమ పరిధిలోగల కుటుంబాలను గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి సందర్శించి, ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించాలని చెప్పారు. భవిష్యత్‌లో వలంటీర్లకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంచి చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర అవార్డులకు ఎంపికైన వలంటీర్లను మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల దుశ్శాలువా, ప్రశంసాపత్రం, నగదు బహుమతితో సత్కరించారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్ధరాతి భరణీ ప్రసాద్, మండలపార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, సర్పంచ్ గంటా విజేత నాగరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, జిల్లా ప్రచార కమిటి అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, వైస్ ఎంపీపీలు సుంకర నాగేశ్వరరావు, దారం శిరీషా, సర్పంచ్‌ల ఛాంబర్ మండల అధ్యక్షుడు శింగంశెట్టి శ్రీనివాస్, నియోజకవర్గ పరిశీలకుడు జక్కంశెట్టి సత్య రాజేంద్ర ప్రసాద్, అత్తిలి టౌన్ అధ్యక్షుడు పోలినాటి చంద్రరావు, మండల పార్టీ నాయకులు రంభ సూరిబాబు, గారపాటి నాగరాజు, కోరుకొల్లు వెంకట్రావు, మహిళా విభాగం అధ్యక్షురాలు కాకర్ల విశాలాక్షి, జిల్లా అనుబంధ కమిటీ నాయకులు నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, రామిశెట్టి రాము, సబ్బితి రాజేష్, గంటా నాగరాజు, పి సంపదరావు, బుడితి సుజన్‌కుమార్, పంపన బుజ్జి, కముజు శ్రీను, బొంతా యశోద, కందుల సత్యనారాయణ, సర్పంచ్‌లు తానుకొండ దయామణి, అడ్డాల భానులలిత మహాలక్ష్మి, ఎంపీడీఓ వీవీవీఎస్ రామారావు పాల్గొన్నారు.

పడాలను ఆదర్శంగా తీర్చిదిద్దడానికి తోడ్పడాలి


పడాల గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

తాడేపల్లిగూడెం రూరల్: పడాల గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడానికి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తోడ్పాటునందించాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. జవహర్ లాల్‌నెహ్రూ టెక్నోలాజికల్ యూనివర్సిటీ సౌజన్యంతో సోమవారం మండలంలోని పడాల గ్రామంలో శశి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ విద్యార్థులు జాతీయ సేవాపథకం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సర్వే నిర్వహించి, నిరుద్యోగ, అక్షరాస్యత వివరాలు సేకరించారు. అలాగే, ప్రజలకు ఓటుపై అవగాహన, పల్స్ పోలి యో కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులను ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారిణి సల్మాన్ బాషా, పడాల ప్రత్యేకాధికారి ఎం.వెంకటేష్, శశి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్‌చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, ప్రిన్సిపల్ మొహమ్మద్ ఇస్మాయిల్, వివిధ విభాగాధిపతులు అభినందించారు.

ప్రారంభమైన మహిళా దినోత్సవాలు


పెంటపాడులో అవగాహన సమవేశంలో పాల్గొన్న అంగన్‌వాడీలు

పెంటపాడు: పెంటపాడు, ముదునూరుపాడు ప్రాంతాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాల వద్ద తల్లులు, కిశోర్‌బాలికలు, చిన్నారులతో సమావేశాలు నిర్వహించారు. పోష్టికాహారం, బాల్యవివాహాలు, బాలికల అక్రమ రవాణా, తదితర విషయాలపై అవగాహన ఏర్పాటు చేశారు. బాలికలను చిన్నచూపు చూడకుండా వారిని పెంచి మంచి విద్యాబుద్ధులు చెప్పించాలని తల్లులకు సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని సోమవారం నుంచి వారోత్సవాలు ఆయా కేంద్రాల వద్ద ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు సూపర్‌వైజర్లు సుజాత, జీజీబీ విజయలక్ష్మి లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అంగన్‌వాడీ వర్కర్లు జయలక్ష్మి, దానమ్మ, గోగుమ్మలతో పాటు చంద్రకుమారి ముదునూరుపాడుకు చెందిన శారదావాణి, నీలకంఠేశ్వరి, సునీత కుమారి, చంద్రమ్మ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి

ఇరగవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలందరికీ మేలు చేస్తున్నాయని తణుకు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొట్ల సురేష్ అన్నారు. సోమవారం ఇరగవరం మండలం గోటేరు గ్రామంలో ఎస్సీలకు అవగాహన సదస్సును నిర్వహించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు ఎవరు అమలు చేయాని సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారు. దీంతో పేద ప్రజల ఎంతో ఆనంద పడుతున్నారన్నారు. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలకు దీటుగా తయారు చేశారని తెలిపారు. పేద ప్రజల పిల్లలకు అందని ద్రాక్షలా ఉన్నా ఇంగ్లీషు మీడియం విద్యను అందుబాటులోకి తెచ్చి పేద ప్రజల పిల్లల బంగారు భవిష్యత్‌కు బంగారు బాటలు వేశారని తెలిపారు. తణుకు నియోజకవర్గన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావును వచ్చే ఎన్నికల్లో గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి త్రిమూర్తులు, ఎస్సీ సెల్ నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న జేసీ రామసుందరరెడ్డి

ఉండి: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ రామసుందరరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఉండి, ఆకివీడు మండలాల తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, ఈవోపీఆర్డీలు, మున్సిపల్ కమీషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులతో ఎన్నికల సన్నద్ధతపై జేసీ సమావేశమైయ్యారు. ఉండి(60)అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి భీమవరం విష్ణు కాలేజ్, సీతా పాలిటెక్నిక్ కాలేజ్ బిల్డింగ్ రెండవ అంతస్థులో స్ట్రాంగ్ రూం, బాట్మింటన్ కోర్టు, ఒకటి,రెండు భాగాల్లో కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.అభ్యర్థులు, వారి ఖర్చులు మూడుసార్లు వ్యయ పరిశీలనకులకు చూపించాల్సి ఉంటుందన్నారు. ఎక్కడైనా అక్రమంగా నగదు గాని వస్తువులు గాని రవాణా లేదా పంపిణీ చేస్తున్నట్లయితే వెంటనే ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఈఎస్ఎంఎస్) యాప్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. పోలింగ్‌కి రెండు లేదా మూడు రోజుల ముందుగా ఎక్కువ నేరాలు జరిగే అవకాశం ఉంటుంది కనుక అధికారులు చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలు బాగా, ఏదైనా అనుమానం ఉంటే సంబంధిత నోడల్ అధికారిని సంప్రదించాలని సూచించారు.

సీఎం జగన్ ఆశయాలను నెరవేర్చాలి

పెనుగొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమాన్ని ప్రజలకు అందిస్తూ వలంటీర్లు సేవలందిస్తున్నారని ఆచంట నియోజకవర్గ వలంటీరు కన్వీనరు కర్రి అనురాధ జోగి రెడ్డి అన్నారు. సోమవారం ఇలపర్రు, ములపర్రు, నడిపూడిలో వలంటీర్లతో సమావేశం నిర్వహించి, ప్రజలకు సత్వరం సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా అందించాలని సూచించారు. సీఎం జగన్ ఆశయాలను వలంటీర్లు నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు అనురాధను ఘనంగా సత్కరించారు.

ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు

ఆకివీడు: దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని, నిధులు కేటాయిస్తుందని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు చెప్పారు. మండలంలోని గుమ్ములూరు గ్రామంలోని పురాతన రామాలయాన్ని పునః ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సందర్శించిన మోషేన్‌రాజు మాట్లాడుతూ అన్ని మతాల దేవాలయాల అభివృద్ధికి సీఎం జగన్ ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారని చెప్పారు. గుమ్ములూరు రామాలయంకు టీటీడీ నిధులు రూ. 10 లక్షలు వచ్చే విధంగా కృషి చేస్తానని చెప్పారు.

నేటి నుంచి మహా శివరాత్రి వేడుకలు ప్రారంభం


విద్యుత్ వెలుగుల్లో తేతలి శివాలయం

తణుకు టౌన్: మహా శివరాత్రి వేడుకలకు తణుకు రూరల్ మండలంలోని పలు శివాలయాలు ముస్తాబయ్యాయి. తణుకు రూరల్ మండలంలో తేతలి గ్రామంలో శివరాత్రి వేడుకలు ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తారు. మండపాక, దువ్వ, కోనాల తదితర గ్రామాల్లో శివాలయాల్లో శివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహిస్తారు. మహా శివరాత్రి వేడుకల సందర్భంగా మండలంలోని శివాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈనెల 6వ తేదీ నుంచి ఆలయాల వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, స్వామివారి కల్యాణోత్సవాలకు ఏర్పాటు చేశారు.

వైద్య ప్రమాణాలను మెరుగుపరచుకోవాలి


ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద వైద్యులతో మాట్లాడుతున్న ఆరోగ్యశాఖ రాష్ట్ర జేడీ సుబ్రహ్మణ్యం

పెంటపాడు: వైద్యశాఖలో ఉన్నత ప్రమాణాలను మెరుగుపరచుకొని ప్రజలకు ఆరోగ్యసేవలు సక్రమంగా అందిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిగా నెరవేర్చాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. సోమవారం పెంటపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. పోలియో శాతం నమోదును, ఆస్పత్రుల్లో అందిస్తున్న సేవలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. పలువురు రోగుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్‌లు తోట రాజేష్, మౌనికలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంగ్లీషు పరీక్ష సోమవారం తాడేపల్లిగూడెం, పెంటపాడులో 6 సెంటర్‌ల్లో ప్రగతి, జీఎంఆర్, ఆదిత్య, వాసవి, గోయంకా ఉమన్స్, పెంటపాడు జూనియర్ కళాశాలలో నిర్వహించారు. పరీక్షలకు 2,190 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 2,122 మంది పరీక్షలకు హాజరైయారు. 68 మంది పరీక్షలకు హాజరు కాలేదు. పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు అధికారులు వెల్లడించారు.

విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించుకోవాలి


బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు గ్రామర్ డే సందర్భంగా మాట్లాడుతున్న హెచ్ఎం దత్

అత్తిలి: విద్యార్థులందరూ ఆంగ్లభాషను శ్రద్ధగా నేర్చుకుని భాషపై పట్టు సాధించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్‌సీ ఎం దత్ చెప్పారు. అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆంగ్లీష్ గ్రామర్ డే సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం దత్ మాట్లాడుతూ అంతర్జాతీయంగా ఎక్కడకు వెళ్లినా ఆంగ్ల భాష మాట్లాడటం అవసరమని, ఉద్యోగ అవకాశాలలో కూడా స్పీకింగ్ స్కిల్స్ తప్పనిసరి అన్నారు. విద్యార్థులు గ్రామర్ నేర్చుకుని మంచి అభివృద్ధి సాధించాలని కోరారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిధిగా హాజరైన టి ఉమ, విద్యార్థులకు ఆంగ్ల గ్రామర్ సులభంగా నేర్చుకునే విధానం గురించి వివరించారు. ఆంగ్ల భాషకు ప్రపంచ వ్యాప్తంగా మంచి అవకాశాలు ఉన్నాయని, గ్రామర్‌ను బాగా నేర్చుకుని ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని కోరారు. ఈ సందర్భంగా ఆంగ్ల ఉపాధ్యాయులు సుభద్ర, లలితలు విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు జరిపి, గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్ బాల సుబ్రహ్మణ్యం, ఎస్ పురుషోత్తం, సుజాత, హర్షద్, మాధవ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అందే సత్యం మృతికి కారుమూరి సంతాపం


అందే సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: ఇటీవల మృతి చెందిన మాజీ జెడ్పీ ఇన్‌చార్జ్ చైర్మన్ అందే సత్యనారాయణ కుటుంబ సభ్యులను రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సోమవారం పరామర్శించారు. అత్తిలి మండలం స్కిన్నెరపురంలో అందే సత్యం చిత్రపటానికి మంత్రి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ అందే సత్యం కాంగ్రెస్ పార్టీలో అంకితభావంతో పనిచేసి, ఉన్నత పదవులు అధిరోహించి, కాంట్రాక్టర్‌గా పని చేస్తూ గ్రామాభివృద్ధికి ఎంతగానో కృషి చేసారని శ్లాఘించారు. ఆయన మృతి గ్రామానికి తీరనిలోటని పేర్కొన్నారు. గ్రామసర్పంచ్ అడ్డాల భానులలిత మహాలక్ష్మి, గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు తమ్మాబత్తుల సత్యనారాయణ, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్ తదితరులు పరామర్శించినవారిలో ఉన్నారు.

ఘనంగా త్యాగరాజు ఆరాధనోత్సవాలు


సంగీత సభలో రమ్య కిరణ్మయి

తాడేపల్లిగూడెం (టీఓసీ): సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి వారి 83వ ఆరాధనోత్సవాలు సందర్భంగా త్యాగరాజ గాన సభ ఆధ్వర్యంలో 3వ రోజు సోమవారం స్థానిక బీవీఆర్ కళా కేంద్రంలో మృదంగభానుడు శ్రీ మహాదేవు లక్ష్మీనారాయణరాజు కళా వేదికపై సీహెచ్ రమ్య కిరణ్మయిచే సంగీత సభ జరిగింది. వైలన్‌పై నాగేశ్వరరావు, మృదంగంపై పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్, ఘటంపై సరస్వతల హనుమంతరావులు సహకరించారు. ఈ కార్యక్రమంలో బుద్దాల వెంకట రామారావు, గరికపాటి బాపయ్య శర్మ, సంగీత విద్వాంసులు, కళాకారులు, బీవీఆర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బీమా చెక్కు అందజేత


పోస్టల్ బీమా చెక్కును అందచేస్తున్న చిత్రం

తాడేపల్లిగూడెం: గ్రామీణ తపాల బీమా తీసుకొని దురదృష్టవశాత్తు మరణించిన వ్యక్తి కుటుంబానికి తాడేపల్లిగూడెం పోస్టల్ అధికారులు సోమవారం పరిహారపు చెక్కును నామినీకి అందజేశారు. తాడేపల్లిగూడెం మండలం నందమూరు గ్రామానికి చెందిన కండెల్లి గంగమ్మ రెండు లక్షల గ్రామీణ తపాలా జీవిత బీమా తీసుకున్నారు.ఆమె ఇటీవలి కాలంలో మరణించారు. ఆమెకు నామినీగా ఉన్న కె.బేబీరాణికి 2,17,930 రూపాయల చెక్కును అందజేశారు. మరణించిన గంగమ్మ 15 నెలల వ్యవధిలో కేవలం 19 వేల రూపాయలు మాత్రమే ప్రీమియంగా కట్టారు. చెక్కు అందచేత కార్యక్రమంలో పోస్టల్ డెవలప్‌మెంటు అధికారి ఎం.గోపీ, ఎంఓలు సత్యనారాయణ,రాంబాబు, నందమూరు బ్రాంచి పోస్టుమాస్టర్ వెంకటరావులు పాల్గొన్నారు.

ఆచంటేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు సర్వం సిద్ధం


రామేశ్వరస్వామి


ఆచంటలో ఆచంటేశ్వరుని (రామేశ్వర స్వామి) ఆలయం

పెనుగొండ : ప్రసిద్ధిగాంచిన ఆచంటలోని ఆచంటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. ఉత్సవాలు సందర్భంగా స్వామి వారిని దర్శించేందుకు భక్తుల సౌకర్యార్థం బారికేట్లు ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణం చుట్టూ చలువ పందిళ్లు నిర్మించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాల నిర్వహణకు ఆలయ కమిటీ చైర్మన్ బుద్దిరాజు విద్యాసాగర్, కమిటీ సభ్యులు, ఆలయ ఈఓ రామచంద్రకుమార్‌లు వివిధ శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించి, ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు తిరునాళ్లలో స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఎ.వేమవరం పీహెచ్‌సీ, ఆచంట సీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందితో పాటు, మందులు అందుబాటులో ఉంచారు. ఆచంట సర్పంచ్ కోట సరోజని, పంచాయతీ కార్యదర్శి నాగబాబు ఆధ్వర్యంలో పారిశుధ్య పనుల పర్యవేక్షణ చేస్తున్నారు.

ఐదు రోజుల పాటు అన్నదానం

ఉత్సవాల ఐదు రోజులు స్వామి వారి సత్రంలో అన్నదానానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో ఏళ్ల తరబడి అన్ని రోజులు అన్నదానం చేయడం విశేషం. గ్రామ పెద్దలు కమిటీగా ఏర్పడి ఏటా భక్తులకు అన్నదానం చేస్తున్నారు.

శివరాత్రి పర్వదినాన రథోత్సవం

కల్యాణోత్సవాల సందర్భంగా శ్రీస్వామివారి కళావేదికపై వివిద సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రతి రోజూ శ్రీస్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పార్వతి అమ్మవారికి కుంకుమపూజలు చేస్తారు. ఆరో తేదీ తెల్లవారు జామున 4 గంటలకు శ్రీస్వామికి కల్యాణ మహోత్సవం, 06, 07వ తేదీ రాత్రి శ్రీస్వామి వారి గ్రామోత్సవం, 08వ తేదీ శుక్రవారం మహాశివరాత్రి , రథోత్సవం, 09వ తేదీ రాత్రి 8 గంటలకు అష్టావధానం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, 10వ తేదీ శ్రీస్వామి వారికి త్రిశూలోత్సవం, గ్రామోత్సవం అనంతరం పుష్పోత్సవం నిర్వహించనున్నారు.